క్లుప్తంగా...

నిరుపేదలకు అండగా ఉంటా



రాజేశ్ కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న లాస్య నందిత

కంటోన్మెంట్: ఆపదలో ఉండే పేదలకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని లాస్య నందిత అన్నారు. నాలుగోవార్డు గాంధీ హట్స్‌కు చెందిన రాజేశ్ బ్లడ్ కేన్సర్‌తో బాధపడుతూ చికిత్స పొందుతున్నాడు. తమకు సాయం చేయాల్సిందిగా బాధితుడి భార్య, లాస్య నందితను కలిసిన విజ్ఞప్తి చేసింది. రాజేశ్‌కు సీఎంఆర్‌ఎఫ్ ద్వారా సాయం అందించేందుకు సహకరిస్తానని చెప్పిన లాస్య నందిత తక్షణ సాయం కింద రూ.20వేలు అందించారు. అధికారులతో మాట్లాడి రాజేశ్‌ను నిమ్స్ హాస్పిటల్‌లో చేర్పించారు.

నిరుద్యోగ నిరసన సభను విజయవంతం చేయాలి

సికింద్రాబాద్: నగరంలో ఈ నెల 8న నిర్వహించనున్న నిరుద్యోగ నిరసన సభకు సికింద్రాబాద్ ప్రాంతం నుంచి పెద్దసంఖ్యలో నిరుద్యోగులు తరలివచ్చి విజయవంతం చేయాలని టీపీసీసీ సీనియర్ నాయకుడు ఆదం సంతోష్‌కుమార్ పిలుపునిచ్చారు. ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక నిరుద్యోగులకు తీరని అన్యాయం జరిగిందన్నారు. నగరంలో జరుగనున్న నిరుద్యోగ నిరసన సభకు ఏఐసీసీ అగ్రనాయకురాలు హాజరవుతున్న నేపథ్యంలో పీసీసీ ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేస్తున్నట్లు సంతోష్‌కుమార్ తెలిపారు.

ట్రాఫిక్ చలాన్లు విధించడం నిలిపివేయండి

రసూల్‌పురా: కంటోన్మెంట్ అన్నానగర్ నుంచి బీరప్ప గుడి వరకు రోడ్లపై నిలుపుతున్న వాణిజ్య వాహనాలకు ట్రాఫిక్ సిబ్బంది జరిమానాలు విధిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని వెంటనే నిలిపివేయాలని రాష్ట్ర మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ మన్నె క్రిశాంక్ నగర సీపీ సీవీ ఆనంద్‌ను కోరారు. పేదలు వాణిజ్య వాహనాలు, కార్లు నడుపుతూ జీవనోపాధి పొందుతున్నారని వేలాది రూపాయల జరిమానాలు విధించడం ద్వారా ఆర్థికంగా నష్టపోతున్నారని ఈ ప్రక్రియపై దృష్టి సారించాలని వినతిపత్రం అందించగా సీపీ సానుకూలంగా స్పందించినట్లు క్రిశాంక్ పేర్కొన్నారు.

అంధ ఫుట్‌బాల్ క్రీడాకారులకు సన్మానం



లాలాపేట: ఏషియా వరల్డ్ బ్లైండ్ ఫుట్‌బాల్ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు నాగగేయని, జాతీయ పోటీల్లో రాణిస్తున్న అఖిలేష్‌లను శనివారం జీహెచ్‌ఎంసీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతా శోభన్‌రెడ్డి సన్మానించారు. తెలంగాణ ప్రభుత్వం సీఎం కేసీఆర్ క్రీడాకారులను ఎంతో ప్రోత్సహిస్తున్నారని అదే క్రమంలో ప్రభుత్వం నుంచి బ్లైండ్ ఫుట్‌బాల్ క్రీడాకారులకు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

చోరీకి గురైన సెల్‌ఫోన్ ఓఎల్‌ఎక్స్‌లో విక్రయం

సనత్‌నగర్: చోరీకి గురైన సెల్‌ఫోన్‌ను ఓ వ్యక్తి ఓఎల్‌ఎక్స్ ద్వారా ఓ యువతికి విక్రయించాడు. అప్పటికే ఫోన్ ఆచూకీ కనిపెట్టే పనిలో ఉన్న విజయవాడ సైబర్ క్రైమ్ పోలీసులు యువతికి ఫోన్ చేయడంతో అసలు విషయం తెలిసి తాను మోసపోయానని తెలుసుకుని ఎస్సార్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. ఎస్‌ఐ సర్దార్ జమాల్ వివరాల ప్రకారం..ఎర్రగడ్డ సుల్తాన్‌నగర్‌కు చెందిన అయేషా బెనజీర్ ఓఎల్‌ఎక్స్‌లో వన్ ప్లస్ నార్డ్ సీఈ–2 మొబైల్ ఫోన్‌ను కొనుగోలు చేసింది. ఓఎల్‌ఎక్స్‌లో పెట్టిన గుర్తు తెలియని వ్యక్తిని ఫోన్ ద్వారా సంప్రదించి నగదు పంపిన తర్వాత అవతలి వ్యక్తి ఫోన్‌ను అయేషాకు పంపారు. కొనుగోలు చేసిన సెల్‌ఫోన్‌కు సంబంధించి బిల్లును పంపాలని అయేషా కోరినప్పటికీ తర్వాత పంపిస్తానని దాటవేశాడు. ఇదిలా ఉండగా ఈ నెల మూడో తేదీన విజయవాడ సైబర్‌క్రైమ్ పోలీసులు ఫోన్‌ను కొనుగోలు చేసిన అయేషాకు ఫోన్ చేశారు. ఆమె వాడుతున్న ఫోన్ చోరీకి గురైందని చెప్పడంతో తాను మోసపోయినట్లు గ్రహించిన శనివారం పోలీసులను ఆశ్రయించింది.

హెచ్‌పీఎస్‌ను సందర్శించిన ఒలంపియన్ అలెక్స్ ఆంటోని

సనత్‌నగర్: బేగంపేటలోని హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ (హెచ్‌పీఎస్)ను ఒలింపియన్ అలెక్స్ ఆంటోనీ శనివారం సందర్శించారు. టోక్యోలో జరిగిన ఒలంపిక్స్‌లో భారతదేశం నుంచి ప్రాతినిధ్యం వహించిన ఆంటోనీ.. హెచ్‌పీఎస్‌లో కొనసాగుతున్న వేసవి శిక్షణ శిబిరం సందర్శించి విద్యార్థులతో కొద్దిసేపు గడిపారు. ఒలింపియన్‌గా తన అనుభవాలను చిన్నారులతో పంచుకున్నారు. విజయం వైపు సాగిపోయే క్రమంలో ఎన్నో అడ్డంకులు మన ముందుంటాయని, వాటిని ఆత్మవిశ్వాసంతో ఎదుర్కోవాలే తప్ప వెనుకడుగు వేయవద్దన్నారు.



కంటోన్మెంట్‌లో కారు చిచ్చు!

- ఆత్మీయ సమావేశానికి సాయన్న వారసుల డుమ్మా
- అదే సమయంలో నాలుగో వార్డులో పర్యటించిన లాస్య
- అధిష్ఠానం, స్థానిక నేతలపై అసంతృప్తే కారణం?
- సమావేశానికి దూరంగా సాయన్న వర్గీయులు



ఐదో వార్డు పరిధిలో నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొన్న బీఆర్‌ఎస్ నేతలు

కంటోన్మెంట్: తామంతా ఒక్కటేనంటూ చెప్పుకుంటున్న కంటోన్మెంట్ బీఆర్‌ఎస్‌లో వర్గ విభేదాలు ఎట్టకేలకు బహిర్గతమయ్యాయి. ఆత్మీయ సమ్మేళనాల సాక్షిగా నేతల మధ్య ఆధిపత్య పోరు తేటతెల్లం అవుతోంది. దివంగత ఎమ్మెల్యే సాయన్న వారసులకు తగిన ప్రాధాన్యం దక్కడం లేదంటూ కొన్ని రోజులు బాహాటంగానే విమర్శలు చేస్తున్న సాయన్న వారసులు ఏకంగా తిరుగుబావుటా ఎగరవేశారు. ఆత్మీయ సమ్మేళనాల ఇన్‌చార్జ్ దాసోజు శ్రవణ్, నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశానికి డుమ్మా కొట్టేశారు. తమ నివాసానికి కూతవేటు దూరంలోనే నిర్వహించిన ఐదో వార్డు ఆత్మీయ సమ్మేళనానికి రాకుండా అదే సమయంలో నాలుగో వార్డులో పర్యటించడం ద్వారా తమ అసంతృప్తిని వెళ్లగక్కే ప్రయత్నం చేశారు. గత నెలలో బోయిన్‌పల్లి మల్లారెడ్డి గార్డెన్స్‌లో నిర్వహించిన ఒకటో వార్డు ఆత్మీయ సమ్మేళనానికి సైతం సాయన్న వారసులు లాస్య నందిత, నివేదిత గైర్హాజరయ్యారు. మంత్రులు తలసాని, మల్లారెడ్డి పాల్గొన్న సమావేశానికి సైతం రాకపోవడంతో అప్పట్లోనే చర్చనీయాంశమైంది. తాజాగా సాయన్న వారసులతో పాటు వారి వర్గానికి చెందిన మెజారిటీ నేతలు రాకపోవడం గమనార్హం.

అలకకు కారణాలేంటో?

దివంగత ఎమ్మెల్యే సాయన్న మరణించిన మరునాడే అంత్యక్రియల విషయంలో ఆయన వర్గీయులు అధిష్ఠానంపై సైతం తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. ఇక సాయన్న దశదిన కర్మ ముగిసిన మరునాటి నుంచే మంత్రి తలసాని, మర్రి రాజశేఖర్ రెడ్డిల నడుమ ఆధిపత్య పోరుతో సాయన్న వారసులకు ఆదరణ లేకుండా పోయింది. ఈ క్రమంలో మర్రి రాజశేఖర్ రెడ్డికి బాధ్యతలు అప్పగించడంతో అసమ్మతి మరింత పెరుగుతూ వచ్చింది. అందరినీ కలుపుకోవడమే తన లక్ష్యమంటూ ఎమ్మెల్యే టికెట్ ఆశిస్తున్న కార్పొరేషన్ చైర్మన్లు మన్నె క్రిశాంక్, గజ్జెల నాగేశ్, ఎర్రోళ్ల శ్రీనివాస్‌లతో గత ఎన్నికల్లో బీజేపీ నుంచి పోటీచేసి బీఆర్‌ఎస్‌లో చేరిన శ్రీగణేశ్ తదితరులందరినీ ఒకే వేదిక మీద కూర్చునేలా చేస్తూ ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో తమ తండ్రి సాయన్న పేరును తగ్గించే కుట్రకు తెరలేపారంటూ సాయన్న వారసులు అలక వహిస్తూ వచ్చారు. అదే సమయంలో తమకు ప్రాధాన్యత తగ్గిస్తున్నారంటూ మర్రి రాజశేఖర్ రెడ్డిని నేరుగా నిలదీసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా సాయన్న హయాంలో నిర్మించిన మడ్‌ఫోర్ట్, మారేడుపల్లి డబుల్ ఇళ్ల పట్టాల పంపిణీ విషయంలో అధిష్ఠానం పెద్దలు కొందరు అడ్డుపడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇదే విషయమై మంత్రి కేటీఆర్‌ను కలిసేందుకు ప్రగతి భవన్‌కు వెళ్లిన సాయన్న అక్కడే తొలిసారిగా గుండెపోటుకు గురై ఆసుపత్రిలో చేరి రెండ్రోజుల చికిత్స అనంతరం మృతి చెందారు. ఈ నేపథ్యంలో ఆయన ఆఖరి కోరికను నెరవేర్చే విషయంలోనూ తమకు సహకారం అందడం లేదని సాయన్న వారసులు ఆవేదనతో ఉన్నారని, ఆయన వర్గీయులు పేర్కొంటున్నారు. అయితే.. తాము వ్యక్తిగత పనుల వల్లే సమావేశానికి రాలేకపోయామంటూ లాస్య, నివేదిత పేర్కొనడం కొసమెరుపు

ఎర్రోళ్ల సైతం..

ఇక నియోజకవర్గం పరిధిలోనే ఐదో వార్డులో నివాసముండే సమయంలోనే డాక్టర్ ఎర్రోళ్ల శ్రీనివాస్ విద్యార్థి విభాగం నేతగా, టీఆర్‌ఎస్ పొలిట్ బ్యూరోలోనూ స్థానం దక్కించుకున్నారు. తొలి తెలంగాణ ప్రభుత్వ హయాంలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా పనిచేసిన ఆయన ప్రస్తుతం టీఎస్–ఎంఎస్ఐడీసీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. తాను సొంతంగా భావించే ఐదో వార్డు ఆత్మీయ సమావేశానికి తనకే ఆహ్వానం లేదంటూ ఆయన డుమ్మా కొట్టడం విశేషం.

అభివృద్ధి పనులు సకాలంలో పూర్తి చేయాలి

సమీక్ష సమావేశంలో డీఎంఈ రమేష్‌రెడ్డి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న డీఎంఈ రమేష్‌రెడ్డి

గాంధీఆస్పత్రి : సికింద్రాబాద్ గాంధీఆస్పత్రిలో చేపట్టిన పలు అభివృద్ధి, భవన సముదాయాల నిర్మాణ పనులను సకాలంలో పూర్తి చేసి నిరుపేదలకు మరింత మెరుగైన వైద్యసేవలు అందించేందుకు కృషి చేయాలని మెడికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ (డీఎంఈ) రమేష్‌రెడ్డి కోరారు. గాంధీ ఆస్పత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న మదర్ అండ్ చైల్డ్ హెల్త్ (ఎంసీహెచ్), స్టేట్ ఆర్గాన్ ట్రాన్స్‌ప్లాంట్ సెంటర్ (ఎస్ఓటీసీ), ఐవీఎఫ్ సెంటర్, డైట్ క్యాంటిన్ భవన నిర్మాణ పనులను శనివారం ఆయన సూపరింటెండెంట్ రాజారావు, వైద్యవిద్య మౌళిక సదుపాయాల కల్పన సంస్థ (టీఎస్ఎంఎస్ఐడీసీ) ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా రమేష్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీలో నూతన భవన నిర్మాణాలు, అభివృద్ధి పనులను ముందుగా నిర్ణయించిన సమయానికి పూర్తి చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ ప్రణాళికలు రూపొందించి అమలు చేయనున్నట్లు తెలిపారు. వైద్యమంత్రి హరీష్‌రావు ఆదేశాల మేరకు ఎస్ఓటీసీ నిర్మాణ పనులు మరింత ముమ్మరం చేశామని, గాంధీలో చికిత్స పొందుతున్న రోగులు, ఇతర సిబ్బందికి ఎలాంటి ఆటంకం కలగకుండా నిబంధనలకు పనులు కొనసాగించేందుకు వెసులుబాటు కల్పించామన్నారు. నిర్మాణ కార్మికులు, సిబ్బందికి కాంట్రాక్టు సంస్థ ఆధ్వర్యంలో గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని సూచించామన్నారు. ఎంసీహెచ్, డైట్ క్యాంటిన్, నైట్‌షెల్టర్ నిర్మాణ పనులు తుదిదశకు చేరుకున్నాయని, ఈనెలాఖారులోగా అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు రూపొందించామన్నారు. అనంతరం వైద్యులు, ఆర్ఎంఓలు, ఇంజనీరింగ్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. ఆయన వెంట రాజారావు, ఆర్ఎంఓ–1 జయకృష్ణ, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ శ్రీనివాస్, డీఈ దుర్గాప్రసాద్, ఏఈలు రాజు, వేణు, ఆర్ఎంఓలు రాము, వెంకట రమణ, యోగేందర్, పద్మ ఉన్నారు.

అధికారులు స్పందించకుంటే..

సొంత నిధులతో నాలాకు అడ్డుగా ప్రహరీ నిర్మిస్తా



ఇందిరమ్మనగర్‌లో బస్తీలో పర్యటిస్తున్న శ్రీ గణేష్

రసూల్‌పురా: వర్షపునీరు ఇళ్లల్లోకి రాకుండా కంటోన్మెంట్ బోర్డు అధికారులు నాలా రిటర్నింగ్ వాల్ నిర్మించని పక్షంలో తానే సొంత నిధులతో రిటర్నింగ్ వాల్ నిర్మిస్తానని బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు శ్రీ గణేష్ హామీ ఇచ్చారు. శనివారం కంటోన్మెంట్ నియోజకవర్గం రసూల్‌పురా ఇందిరమ్మనగర్‌లో నాలాకు ఆనుకుని ఉన్న బస్తీలో శ్రీ గణేష్ పర్యటించి స్థానికులతో మాట్లాడారు. స్థానికంగా నెలకొన్న నీటి, రోడ్డు సమస్యతో పాటు డ్రైనేజీ సమస్య పరిష్కరించాలని స్థానికులు కోరారు. ఇందిరమ్మనగర్‌లో నాలాకు ఆనుకుని ఉన్న ఇళ్లకు అడ్డుగా గోడ లేకపోవడంతో వర్షాలు కురిసినప్పుడు ఎగువ ప్రాంతాల నుంచి వచ్చే నీరు ఇళ్లల్లోకి చేరుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. నాలాకు అడ్డుగా గోడ నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమస్యను కంటోన్మెంట్ బోర్డు అధికారుల దృష్టికి తీసుకెళ్లి సమస్యను స్వయంగా పరిశీలించేందుకు పర్యటించాల్సిందిగా కోరనున్నట్లు చెప్పారు. ఒకవేళ బోర్డు అధికారులు గోడ నిర్మించని పక్షంలో తానే సొంతత నిధులతో గోడను కట్టిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మల్లేష్, జయమ్మ, నరసయ్య, రాము, సుజాత పాల్గొన్నారు.

మాయావతి సభను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న వెంకటేశ్ చౌహాన్

ఉస్మానియా యూనివర్సిటీ: సరూర్‌నగర్ స్టేడియంలో నేడు(శనివారం) జరిగే బీఎస్పీ అధినేత్రి మాయావతి సభను విజయవంతం చేయాలని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర కోఆర్డినేటర్ వెంకటేష్ చౌహాన్ విజ్ఞప్తి చేశారు. శనివారం ఓయూలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో పేద ప్రజల దుఃఖాన్ని చూసి రాష్ట్రంలో తొమ్మిదేళ్ల బీఆర్‌ఎస్ పాలనలో అన్యాయానికి గురైన ప్రజలు, టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీలతో అన్యాయానికి గురైన నిరుద్యోగులకు భరోసా ఇవ్వాలడానికి యూపీ మాజీ సీఎం మాయావతి సభలో మాట్లాడనున్నట్లు పేర్కొన్నారు. ఓయూ నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు, నిరుద్యోగులు హాజరై సభను విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో సంజయ్, అరుణ, తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్‌తో పేదలకు భరోసా



ఎల్ఓసీని అందజేస్తున్న మంత్రి తలసాని

బన్సీలాల్‌పేట్: సీఎం రిలీఫ్ ఫండ్ పేద ప్రజల వైద్య ఆరోగ్య చికిత్సల కోసం కొండంత అండగా ఉంటుందని రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శనివారం బన్సీలాల్‌పేట్ డివిజన్ రామస్వామి కంపౌండ్‌కు చెందిన చిన్నారి అభిగల్ గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. కుటుంబ సభ్యులు సీఎంఆర్‌ఎఫ్‌కు దరఖాస్తు చేసుకోవడంతో ప్రభుత్వం నుంచి మంజూరైన ఎల్ఓసీ పత్రాన్ని శనివారం మంత్రి కుటుంబ సభ్యులకు అందజేసిన అనంతరం మాట్లాడారు. సనత్‌నగర్ నియోజకవర్గంలో ఎంతో మంది పేదలకు వైద్య చికిత్సల కోసం లక్షలాది రూపాయలను మంజూరు చేయించడం జరిగిందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారంతో పాటు పేదల వైద్య ఆరోగ్యం మెరుగు కోసం కృషి చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో వెంకటేషన్, వెంకట్ ముదిరాజ్, కుమార్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో జలమండలి జీఎం మృతి



పీవీ రమణారెడ్డి (ఫైల్)

సికింద్రాబాద్: జలమండలి మారేడుపల్లి డివిజన్ జనరల్ మేనేజర్ పీవీ రమణారెడ్డి (59) గుండెపోటుతో మృతి చెందారు. మారేడుపల్లి డివిజన్ జీఎంగా మూడేళ్లుగా పనిచేశారు. సౌమ్యుడైన అధికారిగా సికింద్రాబాద్ ప్రాంతంలో మంచిపేరు తెచ్చుకున్న రమణారెడ్డి అనారోగ్యం బారినపడి గతనెల 17న సికింద్రాబాద్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చేరగా చికిత్స పొందుతున్న ఆయనకు శనివారం గుండెపోటు రావడంతో మృతిచెందినట్లు వైద్యులు ప్రకటించారు. రమణారెడ్డికి భార్య సంగీత కుమార్తె, కుమారుడు ఉన్నారు. ఆసుపత్రికి చేరుకున్న జలమండలి అధికారులు సిబ్బంది రమణారెడ్డి భౌతికకాయానికి నివాళి అర్పించారు. మారేడుపల్లిలోని జలమండలి కార్యాలయం ముందు రమణారెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసిన అధికారులు, ఉద్యోగులు శ్రద్ధాంజలి ఘటించారు. ఇదిలా ఉండగా విదేశాల నుంచి కుటుంబ సభ్యులు నగరానికి చేరుకోనున్న కారణంగా రమణారెడ్డి భౌతిక కాయానికి సోమవారం (ఈ నెల 8న) అంత్యక్రియలు నిర్వహించనున్నట్టు కుటుంబసభ్యులు తెలిపారు.విషయం తెలుసుకున్న డిప్యూటీ స్పీకర్ పద్మారావు గౌడ్, డిప్యూటీ మేయర్ మోతే శ్రీలతాశోభన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు.

ఓటరు జాబితాలో సవరణలు చేసుకోండి

సికింద్రాబాద్: సికింద్రాబాద్ నియోజకవర్గ ఓటర్లు జాబితాలో తమ వివరాల నమోదుకు సంబంధించిన సవరణలు చేసుకోవచ్చని జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్ ఎన్నికల అధికారి టీ.దశరథ్ తెలిపారు. శనివారం జీహెచ్‌ఎంసీ సర్కిల్ కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో లేదా నెట్ ద్వారా ఓటరు జాబితాలోని తమ పేర్లను ఓటర్లు పరిశీలించుకోవాలని పేర్లు, చిరునామాల నమోదులో తప్పులు దొర్లితే దరఖాస్తు ద్వారా సవరణలు చేసుకోవచ్చన్నారు. ఒకే ఇంటిలో ఆరుగురు అంతకన్నా ఎక్కువ ఓటర్లు ఉన్నట్టయితే వారందరినీ ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో చేర్చే విధంగా ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తున్నామని ఒకే ఇంటిలో నివాసముంటున్న ఓటర్ల పేర్లు ఒకే పోలింగ్ స్టేషన్ పరిధిలో లేకున్నా సవరణలు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎలాంటి తప్పొప్పులు, ఓటర్లకు ఇబ్బందులు లేకుండా ఉండే విధంగా ఓటర్ల జాబితాను రూపొందించాలన్న ఎన్నికల కమిషన్ లక్ష్యం మేరకు పకడ్బందీగా విధులు నిర్వహిస్తున్నామని ఇందుకోసం రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో నరసింహారెడ్డి, కే.భుజేందర్‌బాబు, రాజకీయ పార్టీల నాయకులు జలంధర్‌రెడ్డి, ప్రకాశ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

పార్కుల అభివృద్ధికి చర్యలు

సనత్‌నగర్: పార్కుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటున్నట్లు సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీబాల్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని భగత్‌సింగ్ పార్కుతో పాటు మరో 10 పార్కుల్లో రూ.9.88 లక్షల వ్యయంతో హైమాస్ట్ లైట్ల ఏర్పాటు పనులను శనివారం ఆమె ప్రారంభించి మాట్లాడారు. పార్కుల్లో లైట్లు లేకపోవడంతో సాయంత్రం వాకర్స్‌కు ఇబ్బందికరంగా ఉందని పలువురు తన దృష్టికి తీసుకురాగా ఈ విషయాన్ని మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌కు చెప్పడం జరిగింది. ఆయన వెంటనే స్పందించి ఎక్కడెక్కడ లైట్లు ఏర్పాటు చేయాలో గుర్తించి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించినట్లు చెప్పారు. ఇంకా పార్కుల్లో ఎలాంటి సమస్య ఉన్నా దశలవారీగా పరిష్కరిస్తామన్నారు.


ట్రాఫిక్ నిబంధనలు పాటించండి

సనత్‌నగర్: రోడ్డు భద్రతా నియమాలను పాటించడం ద్వారా సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవచ్చని బేగంపేట ట్రాఫిక్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ శంకర్‌రాజు అన్నారు. ఎస్సార్‌నగర్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని అమీర్‌పేట లాల్‌బంగ్లా రోడ్డులో ఏవీఎస్ వెల్‌నెస్ హాస్పిటల్‌లో ఉద్యోగులు, నర్సింగ్ సిబ్బందికి రోడ్డు భద్రతపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు.స్టాప్‌లైన్, రాంగ్ రూట్, ట్రిబుల్ రైడింగ్, సెల్‌ఫోన్ డ్రైవింగ్ వంటి నిబంధలను ఉల్లంఘించడం వల్ల జరిగే ప్రమాదాల గురించి వివరించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్, కారు డ్రైవింగ్‌లో సీట్ బెల్టు తప్పనిసరిగా పెట్టుకోవాలన్నారు. ట్రాఫిక్ సీఐ సురేష్, టీటీఐ ఎస్ఐ జ్యోతి, చక్రధర్, కార్తీక్ పాల్గొన్నారు.

రైలు కిందపడి వ్యక్తి ఆత్మహత్య

సికింద్రాబాద్: తాగుడుకు బానిసై ఆర్థిక ఇబ్బందులతో ఓ గురైన రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్న ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. మేడ్చల్ జిల్లా దమ్మాయిగూడెంకు చెందిన సింగవరపు మధునాయుడు (45) ప్రైవేటు ఉద్యోగి. మద్యానికి బానిసై ఉద్యోగం చేయడానికి ఆరోగ్యం సహకరించని పరిస్థితి రావడంతో ఆర్థికపరమైన ఇబ్బందులు తలెత్తాయి. మనస్తాపానికి గురైన మధునాయుడు శనివారం మేడ్చల్ రైల్వేస్టేషన్‌కు చేరుకుని మేడ్చల్ నుంచి సికింద్రాబాద్ వస్తున్న రైలుకింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు.

బీఆర్‌ఎస్‌తోనే కంటోన్మెంట్ అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న మర్రి రాజశేఖర్ రెడ్డి

కంటోన్మెంట్: బీఆర్‌ఎస్ ప్రభుత్వంతోనే కంటోన్మెంట్ అభివృద్ధి చెందుతోందని ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. కంటోన్మెంట్‌కు రావాల్సిన కోట్లాది రూపాయల నిధులు నిలిపివేసిన బీజేపీ, ప్రశ్నిస్తానంటూ పత్తా లేకుండా పోయిన కాంగ్రెస్ అధ్యక్షుడితో కంటోన్మెంట్‌కు ఒరిగిందేమీ లేదన్నారు. శనివారం నిర్వహించిన ఐదో వార్డు బీఆర్‌ఎస్ ఆత్మీయ సమ్మేళనానికి దాసోజు శ్రవణ్‌తో కలిసి ఆయన హాజరై మాట్లాడారు. త్వరలోనే నియోజకవర్గం పరిధిలో 1500 మందికి దళిత బంధు నిధులు అందుతాయని గాంధీనగర్, వాల్మీకీనగర్ వంటి బస్తీ వాసులకు గృహలక్ష్మీ పథకం ఇంటి నిర్మాణానికి రూ.3 లక్షల చొప్పున నిధులు అందిస్తామన్నారు. కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యుడు గానీ.. వారి పార్టీ అధ్యక్షుడు కానీ ఐదోవార్డు 108 బజార్‌లో పేదలకు ఒక్క ఇల్లయినా కట్టిసారా అని ప్రశ్నించారు.కార్పొరేషన్ చైర్మన్లు గజ్జెల నగేష్, క్రిశాంక్, బోర్డ్ మాజీ సభ్యులు మహేశ్వర్ రెడ్డి, పాండు యాదవ్, లోకనాథం, భాగ్యశ్రీ, నళిని కిరణ్, బోయిన్‌పల్లి మార్కెట్ చైర్మన్ హారిక, మాజీ చైర్మన్ టీఎన్ శ్రీనివాస్, నేతలు పెద్దల నర్సింహా, ముప్పిడి మధుకర్, కృష్ణ యాదవ్, కిరణ్, శ్రీహరి, రావుల సతీష్, సురేందర్, ప్రవీణ్ యాదవ్ పాల్గొన్నారు.



సకల హంగులతో రూపుదిద్దుకున్న ధనియాలగుట్ట శ్మశానవాటిక



ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

- ప్రారంభానికి సిద్ధమైన ధనియాలగుట్ట శ్మశానవాటిక
- ఈ నెల 9న ప్రారంభించనున్న మంత్రులు కేటీఆర్, తలసాని

సనత్‌నగర్: కనీవినీ ఎరుగని రీతిలో రూపుదిద్దుకున్న ధనియాలగుట్ట శ్మశానవాటిక ప్రారంభోత్సవం ముహూర్తం ఖరారైంది. ఈ నెల 9న మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ప్రారంభించనున్నారు. శనివారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఏర్పాట్ల పనులను పర్యవేక్షించారు. ఎన్నో అడ్డంకులను అధిగమించి మహానగరంలోనే అత్యంత సుందరంగా బేగంపేట శ్మశానవాటికను నిర్మించామని ఈ సందర్భంగా ఎమ్మెల్యే తెలిపారు. బేగంపేట నివాసితుల దశాబ్దాల కల నెరవేరబోతుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ సహాయ సహకారాలతోనే ఇది సాధ్యపడిందన్నారు. ఎంతోమంది పాలకులు చేయలేని పనులను కేవలం తొమ్మిదేళ్లలోనే ముఖ్యమంత్రి కేసీఆర్ చేసి చూపించారన్నారు. ఎమ్మెల్యే వెంట బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, జోనల్ కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి ఉన్నారు.

ఆరడుగుల జాగా కోసం..

ఆరడుగుల జాగా కోసం బేగంపేట నివాసితులు తొక్కని గడపా లేదూ..విజ్ఞప్తులు అందుకున్న ప్రజాప్రతినిధీ లేరూ. ఐదు దశాబ్దాలుగా దహన సంస్కారాలకు ఇక్కడి వారు పడ్డ అవస్థలు అన్నీ ఇన్నీ కావు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక మొదటిసారిగా జరిగిన ఎన్నికల్లో కూకట్‌పల్లి నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన కృష్ణారావు ఇక్కడి వారి న్యాయమైన పోరాటంపై స్పందించి తాను సైతం కదం తొక్కారు. అప్పటివరకు శ్మశానవాటికకు నిర్దిష్టమైన స్థలమంటూ లేదు. ప్రభుత్వాలను సైతం శాసించే ఓ బడా స్కూల్ యాజమాన్యం గుప్పిట్లో ఉన్న ఆ స్థలంలో దహన సంస్కారాలు చేయాలంటే జంకే పరిస్థితులు ఉండేవి. అలాంటి పరిస్థితులను సైతం ఢీకొట్టి కేసులను సైతం లెక్కచేయకుండా మూడున్నర ఎకరాల స్థలాన్ని శ్మశానవాటికకు కేటాయించి రూ. 7.50 కోట్లతో వైకుంఠధామం నిర్మించడంలో ఎమ్మెల్యే సఫలీకృతులయ్యారు.

సకల సౌకర్యాలతో..

విశాలమైన రోడ్లు, నాలుగు దహన వాటికలు, పూజ, పిండ ప్రదానం హాల్, కట్టెలు నిల్వ, అస్థికలు భద్రపరిచే, స్నానాల గదులు వంటి వసతులతో పా టు మంచినీటి సంప్, ఎలక్ట్రికల్, టాయిలెట్స్ వంటి సర్వత్రా సౌకర్యాలు కల్పించారు. ఇక్కడి నిర్మాణాలు ఆధునిక శైలిలో నిర్మితమై కనువిందు చేస్తున్నాయి. మధ్యలో అందమైన గార్డెన్‌గా తీర్చిదిద్దిన తీరు ఆకట్టుకుంది. ఇక ధ్యానముద్రలో ఉన్న పరమశివుడు విగ్రహాన్ని ప్రతిష్టించారు. శ్మశానవాటికలోని రోడ్ల వెంబడి, చుట్టూ గ్రీనరీని ఏర్పాటు చేశారు. బేగంపేట శ్యాంలాల్ బిల్డింగ్, తాతాచారి కాలనీ, భగత్‌సింగ్, వడ్డెరబస్తీ వంటి దాదాపు 20 బస్తీలకు ఈ శ్మశానవాటిక అందుబాటులోకి రానుంది. .